

అవధాన విద్యకు మెదక్ పుట్టినిల్లు
● ప్రముఖ అష్టావధాని బోచ్కర్ ఓంప్రకాశ్
● మర్కుడగ క్షేత్రంలో అష్టావధాన కార్యక్రమం
7

అసైన్డ్ భూమికి ఎసరు..!

గద్దల్లా వాలుతున్న ల్యాండ్ మాఫియా

కోర్టు ఆర్డర్ అడ్డం పెట్టుకుని రూ. కోట్లు విలువైన ప్రభుత్వ భూమి కబ్జా

అమీన్‌పూర్ డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పక్కనే రూ. కోట్ల విలువైన స్థలం

పటాన్‌చెరు, జూలై 13: విలువైన ప్రభుత్వ భూములకు రక్షణ కరువైంది. విలువైన స్థలాల్లో ల్యాండ్ మాఫియా గద్దల్లా వాలిపోతున్నారు. అమీన్‌పూర్ 992, 994, 996 సర్వే నంబర్లలో ప్రభుత్వ అసైన్డ్ భూములు ఉన్నాయి. ఈ భూములను అమ్మడం.. వాణిజ్య అవసరాలకు వినియోగించడం నిషిద్ధం. కానీ, కొందరు అసైన్‌మెంట్ పట్టాదారుల నుంచి తక్కువ ధరకు భూములను కొనుగోలు చేసిన రియల్టర్లు ప్లాట్లుగా విభజించి సొమ్ము చేసుకుంటున్నారు. అసైన్డ్ భూములతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను సైతం కబ్జా చేస్తున్నారు. సామాన్యులకు అంటగడుతున్నారు. వంద గజాల చొప్పున చేసిన ప్లాట్లలో గదులను నిర్మించారు. అక్రమ నిర్మాణాలను కూల్చకుండా రెవెన్యూ అధికారులకు, కింది స్థాయి సిబ్బందిని మచ్చిక చేసుకున్నారు. తాజాగా నిర్మించిన గదుల చుట్టూ ప్రహరీని నిర్మించి స్థలాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. వంద గజాల స్థలాన్ని రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు అమ్ముతున్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా స్టాంప్‌పేపర్లపై ప్లాట్ నంబర్ వేసిన దస్తావేజులను ఇస్తున్నారు. కొనుగోలు చేసిన స్థలంలో గదిని నిర్మించడం, రెవెన్యూ వారు కూల్చకుండా చూడటం, కరెంటు మీటర్ ఇప్పించడం కోసం అదనంగా వసూలు చేస్తున్నారు. కబ్జా చేసిన ప్లాట్ల వద్దనే ఆఫీసును తెరిచి అమ్మకాలు సాగిస్తున్నారు.

కోర్టు ఉత్తర్వుల పేరిట దందా..

అక్రమార్కులు భూములను కబ్జా చేయడానికి కోర్టు ఇదివరకు జారీ చేసిన నాట్ టు ఇంటర్‌ఫియర్ ఆర్డర్‌ను అడ్డం పెట్టుకుంటున్నారు. 2012లో కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల నంబర్లను కబ్జా చేసిన స్థలాల గోడలపై వేసి నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. 30 ప్లాట్ల గురించే కోర్టు ఆర్డర్‌లో పేర్కొనగా.. లెక్కకు మించి అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. వందల ప్లాట్లకు అవే కోర్టు ఉత్తర్వుల నంబర్లు వేస్తూ విక్రయిస్తున్నారు. ఇది చాలదన్నట్టు పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సైతం అసైన్డ్ భూముల పేరిట అమ్మకాలు జరుపుతున్నారు. అయినా, ఈ ఆర్డర్‌ను రద్దు చేయించేందుకు రెవెన్యూ యంత్రాగం ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడం గమనార్హం. అలాగే, అసైన్డ్ చట్టం ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన భూమిలో అసైన్డ్‌దారులు కాకుండా ఇతరులు కబ్జాలో ఉంటే తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇవేవీ చేయకుండా రెవెన్యూ అధికారులు అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



అసైన్డ్ భూముల్లో నిర్మించిన గదులు

ల్యాండ్ మాఫియా..

వ్యవస్థల్ని అడ్డంపెట్టుకుని భూములను కొల్లగొట్టడంలో సిద్ధహస్తులని ప్రచారంలో ఉన్న ల్యాండ్ మాఫియా కన్ను అమీన్‌పూర్ భూములపై పడింది. అసైన్‌మెంట్, ప్రభుత్వ భూములను వారే కొల్లగొడుతున్నారు. గతంలో ఈ మాఫియా దుండిగల్, గోపన్‌పల్లి తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున ప్రభుత్వ భూములను కబ్జా చేసిన చరిత్ర ఉంది. పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు సైతం నమోదయ్యాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం

అసైన్డ్‌భూములు, ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ల్యాండ్ గ్రాబింగ్ చట్టం కింద క్రిమినల్ నమోదు చేస్తాం. అసైన్డ్ భూములను విక్రయించడం నిబంధనలకు వ్యతిరేకం. అసైన్డ్‌దారులు కబ్జాలో ఉంటూ వ్యవసాయం చేసుకోవాలి. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే తక్షణం పట్టాలను రద్దు చేస్తాం. కోర్టు వ్యవహారాల్లో ఉన్న భూములపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

-బాల్‌రాజ్, డిప్యూటీ తహసీల్దార్, అమీన్‌పూర్ మండలం



ఇంటర్ అడ్మిషన్లు డీలా..!

- సర్కారు కాలేజీలపై ఆసక్తి చూపని విద్యార్థులు
- మెదక్ జిల్లాలో 16 ప్రభుత్వ కళాశాలలు
- ఈ నెల 31 వరకు ప్రవేశాలకు గడువు
- ఇప్పటివరకు సగం సీట్లే భర్తీ

మెదక్ అర్బన్, జూలై 13: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఉచిత విద్య, ఉచిత పుస్తకాలు అందిస్తున్నా ఆశించిన స్థాయిలో ప్రవేశాలు రావడం లేదు. కళాశాలలు వెలవెలబోతున్నాయి. ప్రవేశాలకు మరో అవకాశం కల్పించినా 50 శాతం కూడా సీట్లు భర్తీ కాలేదు. సుశిక్షితులైన అధ్యాపకులున్నా.. ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించినా ఫలితం దక్కడం లేదు. ఆశించినట్లు ఇంటర్ ఫలితాలు రాకపోవడం, నిధుల కొరత, సమస్యలు, గురుకులాలు, కస్తూర్బాలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపడంతో ప్రభుత్వ కాలేజీల్లో చేరేవారి సంఖ్య ప్రతీ ఏటా తగ్గుతోందనే వాదన వినిపిస్తోంది. ఆర్థిక స్థోమత లేకపోయినా తలిదండ్రులు విద్యార్థులను ప్రైవేటు కళాశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రవేశాలకు విద్యార్థులు ఆసక్తి చూపకపోవడంలో అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు.

సగం సీట్లు ఖాళీ

మెదక్ జిల్లాలో మొత్తం 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలున్నాయి. ఇందులో మెదక్, చేగుంట, రామయంపేట, చిన్నశంకరంపేట కళాశాలల్లో వృత్తి విద్యా కోర్సులు కూడా నిర్వహిస్తున్నారు. వాటితోపాటు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో విభాగంలో 88 సీట్లున్నాయి. దాదాపు 4,300 సీట్లు ఖాళీలుండగా.. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు జనరల్ విభాగంలో 2,097, వృత్తి విద్య విభాగంలో 382 మంది విద్యార్థులు చేరారు. అంటే 50 శాతం కూడా ప్రవేశాలు భర్తీ కాలేదు.

ఎన్నో కారణాలు..

సర్కారు కాలేజీల్లో సీట్లు భర్తీ కాకపోవడానికి అనేక కారణాలున్నాయి. ప్రభుత్వం శాశ్వత అధ్యాపకులు నియామకం చేపట్టం లేదు. గెస్ట్ లెక్చరర్‌లతో బోధన సాగిస్తున్నారు. కొన్నాళ్లగా విద్యార్థులను ఊరిస్తున్న మధ్యాహ్నభోజన పథకం కలగానే మారడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తమ పిల్లలను దూరం పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. అంతేకాకుండా కళాశాలల నిర్వహణకు నిధులు విడుదల కావడం లేదు. ఒకప్పుడు ప్రవేశాల కోసం పోటీపడి సీటు దక్కించుకునేవారు. విద్యార్థులతో కళాశాలలు కళకళలాడేవి. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య తగ్గి వెలవెలబోతున్నాయి. అధ్యాపకులు విద్యార్థుల ఇంటింటికి వెళ్లి బతిమాలినా అడ్మిషన్లకు ఆసక్తి చూపడం లేదు. తగినంత మంది విద్యార్థులు లేకుంటే కళాశాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు.

ప్రవేశాలు పెంచేందుకు చర్యలు

ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు చర్యలు చేపడుతున్నాం. అధ్యాపకులు ఇంటింటా ప్రచారం కూడా చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రైవేటుతో పోలిస్తే ప్రభుత్వ కాలేజీల్లోనే నాణ్యమైన బోధన అందుతుంది. జూలై 31 వరకు అవకాశం ఉండడంతో ప్రవేశాలు పెరుగుతాయని భావిస్తున్నాం.

-సత్యనారాయణ, ఇంటర్ నోడల్ అధికారి మెదక్

అలైన్‌మెంట్ మార్చాల్సిందే..

● ట్రిపుల్‌ఆర్ సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకున్న రైతులు ● జాతీయ రహదారిపై రాస్తారోకో

నర్సాపూర్/శివ్వంపేట, జూలై 13: రీజినల్ రింగురోడ్డు అలైన్‌మెంట్ మార్చాల్సిందేనని, పరిహారం విషయం తేల్చాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే డిమాండ్‌తో సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లిలో రీజినల్ రింగు రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని డిమాండు చేస్తూ కొంతకాలంగా రైతులు ఆందోళన చేస్తున్నారు. ఈక్రమంలో సర్వే కోసం గ్రామానికి వెళ్లిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇప్పటికే రెడ్డిపల్లి సమీపం నుంచి కాళేశ్వరం కాలువ, హైటెన్షన్ విద్యుత్ స్తంభాల వల్ల ఇక్కడి రైతులు భూములు కోల్పోయారని ఇప్పుడు ఇదే ప్రాంతం నుంచి మళ్లీ రీజినల్ రింగురోడ్డు వెలితే ఈ గ్రామంలోని భూములతో పాటు గ్రామమే ఉనికి లేకుండా పోతుందని దీంతో తమ బతుకులు ఛిద్రం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా రీజినల్ రింగురోడ్డు కోసం గతంలో సర్వే చేసిన సమయంలో రెడ్డిపల్లి ప్రాంతంకు ఇబ్బంది లేకుండా అలైన్‌మెంటు నిర్ణయించారని కాని ఇప్పుడు ఇదే ప్రాంతం నుంచి వెళ్లేలా చూస్తున్నారని అందువల్ల తాము ఎట్టి పరిస్థితిలో భూములు ఇచ్చే ప్రసక్తి లేదన్నారు. అలైన్‌మెంటు మార్చుతామని హామీ ఇస్తేనే విరమించుకుంటామని మొండికేయడంతో ఆర్డీవో కలుగజేసుకుని మీ ఆవేదను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తగిన న్యాయం జరిగేలా ప్రయత్నిస్తామని హామీ ఇవ్వడంతో విరమించారు.



రెడ్డిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులకు నచ్చజెప్తున్న ఆర్డీవో, అధికారులు

నాలుగోసారీ వెనక్కి..

నష్టపరిహారంపై తేల్చేవరకు రీజినల్ రింగురోడ్డు సర్వే చేయనిచ్చేది లేదని నాలుగోసారి సర్వే కోసం వచ్చిన అధికారులను రత్నాపూర్ గ్రామస్థులు అడ్డుకున్నారు. శివ్వంపేట మండల పరిధిలోని రత్నాపూర్ గ్రామంలో 56 మంది చిన్న సన్నకారు రైతులకు చెందిన 97 ఎకరాల భూమి రీజినల్ రింగ్‌రోడ్డులో పోతున్నది. సర్వే చేయడానికి వచ్చిన నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, అధికారులు లక్ష్మీసుజాత, సతీష్, మొగులయ్య, విజయలక్ష్మి, సునీల్, కిషన్ శనివారం గ్రామంలో సర్వే చేయడం కోసం వచ్చారు. వారిని భూ నిర్వాసితులు అడ్డుకున్నారు. రైతులకు ఎంత నష్టపరిహారం చెల్లిస్తారో తేల్చే వరకు భూమిని సర్వే చేయనివ్వబోమని అడ్డుకున్నారు. దీంతో, గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ భూమిని కోల్పోతున్న రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, సమాచారం ఇవ్వకుండానే అధికారులు సర్వే చేయడానికి వచ్చారని మండిపడ్డారు. భూమిని కోల్పోతున్నవారంతా చిన్న, సన్నకారు రైతులేనని, తమకు భూమికి బదులు మరోచోట భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు గ్రామస్థులు అధికారులకు వినతి పత్రం అందజేశారు.

రెండో రోజు దీక్షలు

నర్సాపూర్, జూలై 13: కాళేశ్వరం ప్రాజెక్టు సంగారెడ్డి కాలువ కోసం భూ సేకరణ చేయడం నిలిపేయాలని డిమాండు చేస్తూ భూ నిర్వాసితులు నర్సాపూర్‌లో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం రెండోరోజు కొనసాగాయి. నర్సాపూర్, శివ్వంపేట మండలాలకు చెందిన రైతులు మహేష్ గౌడ్, రామకృష్ణ, కొండల్, హన్మంతు, అంజిగౌడ్, కిష్టాగౌడ్, పోచయ్య తదితరులు దీక్షలో పాల్గొన్నారు. పరిహారంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చేవరకు దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



దీక్ష చేస్తున్న రైతులు

భద్రతకు ప్రాధాన్యం

ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటా

ఏ సమస్య ఉన్నా నేరుగా కలవొచ్చు

మెదక్ నూతన ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జూలై 13: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యమిస్తామని, ఏ సమస్య ఉన్నా ప్రజలు తనను నేరుగా కలవచ్చని మెదక్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డి. ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మెదక్ జిల్లా 4వ ఎస్పీగా డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయనకు అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. బదిలీపై వెళ్తున్న ఎస్పీ డా.బాలస్వామి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అక్రమార్కులు పద్ధతి మార్చుకోవాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. తప్పుచేసిన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మహిళలు, యువతుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల సందరిస్తానని, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ.. నేరాల కట్టడి చేసేందుకు నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాత్రివేళ్లలో పెట్రోలింగ్, గస్తీ ముమ్మరం చేస్తామని చెప్పారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా చూడటం, వ్యవస్థీకృత నేరాలను అరికట్టడంపై దృష్టిసారిస్తామన్నారు. సహాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్, డీఎస్పీలు డా.రాజేష్, వెంకటరెడ్డి, సైబర్‌సెల్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్, ఏఆర్ డీఎస్పీ రంగనాయక్, జిల్లాలోని సీఐ, ఎస్‌ఐలు, సిబ్బంది పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు.



ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

సంగారెడ్డిలో అదనపు కోర్టులు

ప్రారంభించిన హైకోర్టు న్యాయాధికారులు

సంగారెడ్డి అర్బన్, జూలై 13 : సంగారెడ్డిలోని జిల్లా కోర్టు ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టు, అడిషనల్ అసిస్టెంట్ సెషన్ కోర్టులను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయాధికారి, సంగారెడ్డి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయాధికారి టి.మాధవిదేవీ, హైకోర్టు న్యాయాధికారి అనిల్‌కుమార్ జూకంటి శనివారం ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవాని చంద్ర, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి వారు ప్రారంభించారు. అంతకుముందు ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయాధికారులను స్థానిక ఐబీ వద్ద జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అంతకుముందు వారు వైకుంఠపురం ఆలయాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రూపేష్, వివిధ కోర్టుల న్యాయాధికారులు, జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి, సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో అదనపు సీనియర్ సివిల్, అడిషనల్ అసిస్టెంట్ సెషన్ కోర్టులు ప్రారంభిస్తున్న న్యాయాధికారులు



దోస్త్ మేరా దోస్త్..!

మెదక్ ఎంపీ రఘునందన్ శనివారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తనతో ఇంటర్, డిగ్రీ చదువుకున్న స్నేహితులతో కలిసి, సరదాగా గడిపారు. 1980-85 బ్యాచ్‌కు చెందిన సుమారు 40 మంది సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. ఇంటర్ బైపీసీ, డిగ్రీ బీజేడీసీ చదివిన నాటి స్నేహితులు ఆత్మీయంగా పలకరించుకున్నారు.

-సిద్దిపేట క్రైం, జూలై 13:

జిల్లా కేంద్రంలో రోడ్లన్నీ అధ్వానం

- మంత్రి నివాసం వద్ద రోడ్డుపై మురుగునీరు
- రాజంపేట-మల్కాపూర్ రోడ్డు గుంతలమయం
- చోద్యం చూస్తున్న అధికారులు

సంగారెడ్డి టౌన్, జూలై 13 : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో అంతర్గత రహదారులు అధ్వాన్నంగా మారాయి. రోడ్లు ఛిద్రమై, గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. పలుచోట్ల మురుగు ప్రవాహంతో కాల్వలను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఇక్కట్లపాలవుతున్నారు. పేరుకు గ్రేడ్-1 మున్సిలిటీ అయినప్పటికీ రోడ్లకు మరమ్మతులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మంత్రి నివాసం వద్ద మురుగు ప్రవాహం

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని విద్యానగర్ రోడ్డు నంబరు 5లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నివాసం వద్ద మూడునెలలుగా మురుగు రోడ్డుపైనే ప్రవహిస్తున్నది. తీవ్రమైన దుర్గంధం వెలువడుతున్నా.. దోమలు స్వైరవిహారం చేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. వారంలో మూడు, నాలుగు రోజులపాటు మంత్రి ఇక్కడే ఉంటున్నారు. ఆయనను కలిసేందుకు నిత్యం వందలాది మంది వస్తుంటారు. వారందరూ ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ మురుగుకాల్వను శుభ్రం చేయాలని పలుమార్లు మున్సిపల్ అధికారులను కోరినా పెడచెవిన పెడుతున్నారని కాలనీవాసులు వాపోయారు.

రెండు కిలోమీటర్లు గుంతలమయం..

జిల్లా కేంద్రంలోని రాజంపేట-మల్కాపూర్ రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాజంపేట నుంచి మల్కాపూర్ వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర రోడ్డుపై భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డును బాగుచేయాలని రాజంపేట, రాంచంద్రారెడ్డి నగర్, విజయనగర్‌కాలనీ, గీతానగర్, ప్రగతినగర్ తదితర కాలనీల ప్రజలు పలుమార్లు కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో రోడ్డును బాగు చేయాలని స్వయంగా కలెక్టర్ ఆదేశించినా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతులు చేయలేదు.





సంగారెడ్డిలో మంత్రి దామోదర్ నివాసం వద్ద మురుగు ప్రవాహం, గుంతలమయంగా మారిన రాజంపేట-మల్కాపూర్ రోడ్డు

పరీక్షల్లో ఫెయిలయ్యానని ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

తూప్రాన్, జూలై 13: ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైన ఓ విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియకుండా టీసీ తీసుకొచ్చింది. కుటుంబీకులు వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన తుప్రాన్ మండలం దాతర్‌పల్లిలో శుక్రవారం రాత్రి జరిగింది. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం దాతర్‌పల్లి గ్రామానికి చెందిన బోసమైన మహేశ్, జ్యోతి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు గాయత్రి (17) సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ప్రభుత్వ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. గత సంవత్సరం మొదటి సంవత్సరంలో ఫెయిల్ అయింది. కుటుంబీకులకు తెలియకుండా కళాశాల నుంచి టీసీ తీసుకొని వచ్చింది. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. రాత్రి తల్లిదండ్రులు ఇంటికివచ్చి చూడగా తలుపులకు లోపలి నుంచి గడి పెట్టి ఉంది. వెంటిలేటర్ నుంచి చూస్తే గాయత్రి ఉరి వేసుకుని కనిపించింది. తలుపులు విరగ్గొట్టి వెళ్లి చూడగా, అప్పటికే చనిపోయింది. తండ్రి మహేశ్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం వివరించారు.

రోడ్డుకు అడ్డంగా పరిశ్రమ కాలువ

గుమ్మడిదల, జూలై 13: అసలే గుంతల రోడ్డుతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అదీ చాలదన్నట్టుగా ఇటీవల వర్షం నీటిని వదలడానికి ఓ పరిశ్రమ ఏకంగా రోడ్డుని తవ్వేసి కాలువ నుంచి నీటిని వదలడం వాహనదారుల పాలిట ప్రమాదకరంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కానుకుంట గుమ్మడిదల ప్రధాన రోడ్డుపై గల ఓ పరిశ్రమ ఆవరణ నుంచి వర్షపు నీటిని వదిలేందుకు ఏకంగా రోడ్డునే తవ్వి కాలువ తీశారు. కానుకుంట గుమ్మడి దల గ్రామాలకు వెళ్లే వాహనదారులకు ఈ కాలువ ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై ప్రమాదకర కాలువ విషయమై పరిశ్రమ యాజమాన్యాన్ని నిలదీసినా ఫలితం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. పెద్ద వాహనాలు రోడ్డు దాటాలంటే కాలువ అడ్డుగా మారిందని ఆరోపిస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కాలువను పూడ్చే విధంగా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.



ప్రధాన రోడ్డుపై తీసిన కాల్వ

కార్మికుల శ్రేయస్సే సీఐటీయూ ధ్యేయం



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

కోహీర్, జూలై 13: కార్మికుల శ్రేయస్సే సీఐటీయూ కార్మిక సంఘం ప్రధాన ధ్యేయమని సీఐటీయూ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పేర్కొన్నారు. మండలంలోని దిగ్వాల్ గ్రామంలో గల పిరమల్ ఫార్మా పరిశ్రమలో ఈ నెల 15న జరుగనున్న కార్మిక సంఘం ఎన్నికల సందర్భంగా శనివారం కర్మాగారం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో చుక్కరాములు మాట్లాడారు. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల కోరికలకు అనుగుణంగా మంచి అగ్రిమెంటు చేసి చూపించిన సీఐటీయూ కార్మిక సంఘాన్ని మరోసారి గెలిపించాలని చుక్క రాములు కోరారు. పెరిగిన జీతంతో సంబంధం లేకుండా వీడీఏ డబ్బులను పెంచేల సీఐటీయూ కార్మికసంఘం కృషి చేసిందన్నారు. మెడిక్లెయిమ్ పాలసీ కార్మికుల వేతనాల నుంచి ఎలాంటి కోత లేకుండా యాజమాన్యమే పూర్తి డబ్బులు చెల్లించే విధంగా ఒప్పించి రూ.3 లక్షల నుంచి 4 లక్షల వరకు పాలసీని పెంచినట్టు తెలిపారు. 15వ తేదీన జరిగే కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు బి మల్లేశం, నాయకులు నర్సయ్య, సాయిలు, పాండురంగారెడ్డి, రాజిరెడ్డి, షైపాల్, నరసింహులు సందీప్ రెడ్డి, నారాయణ, గణేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

క్యాంటీన్లలో ఫుడ్ సేఫ్టీ తనిఖీలు

పటాన్‌చెరు రూరల్, జూలై 13: చిట్కుల్ మహేశ్వర మెడికల్ కళాశాల క్యాంటీన్‌తోపాటు ముత్తంగి మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల క్యాంటీన్‌లను శనివారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేశారు. మహేశ్వర మెడికల్ కళాశాలలో ఫుడ్ హ్యాండ్లర్లు హెడ్‌క్యాప్స్, అప్రాన్లు ధరించి లేకపోవటం, స్టోర్ రూమ్‌లో ముడి పదార్థాలు చిందరవందరగా ఉండటం, క్లీనింగ్‌కి వాడే కెమికల్స్ ఆహార ముడిపదార్థాలతో ఉండటం, డస్ట్ బిన్స్ తెరిచి ఉండటం, స్టోర్‌లోని ఆహార పదార్థాలు బహిరంగ స్థితిలో ఉండటం గమనించారు. మహాత్మా జ్యోతిబా పూలే క్యాంటీన్‌లో ఫుడ్ హ్యాండ్లర్లు హెడ్ క్యాప్స్, అప్రాన్లు ధరించి లేకపోవటం, ఫుడ్ హ్యాండ్లర్లు ధరించిన దుస్తులు అపరిశుభ్రంగా ఉండటం, ఫుడ్‌హ్యాండ్లర్లకు మెడికల్ సర్టిఫికెట్స్ లేకపోవటం గమనించారు. ఆయా క్యాంటీన్లలో నమూనాలు సేకరించి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసిరకం ఆహార పదార్థాలను, గడువు ముగిసిన ఆహార పదార్థాలను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్యాంటీన్లు శుభ్రతను పాటించాలని సూచించారు.


టీచర్లను పట్టుకుని కన్నీటిపర్యంతమవుతున్న విద్యార్థినులు

మీరు ఇక్కడే ఉండండి టీచర్...!

తాడ్దానిపల్లిలో విద్యార్థినుల కన్నీటిపర్యంతం

పుల్‌కల్, జూలై 13: 'మీరు ఇక్కడే ఉంటూ పాఠాలు చెప్పండి టీచర్..! మీరు రాని బడికి మేము రాలేము' అంటూ విద్యార్థినులు గొల్లుమన్నారు. చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి కేంద్ర ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న ఎస్‌జీటీ స్వరూపతోపాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులు ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లారు. వారికి శనివారం పాఠశాలలో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులందరూ పాఠశాలకు వచ్చి బదిలీపై వెళ్తున్న వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను పట్టుకుని కంటతడి పెట్టుకుని బోరున విలపించారు. మీరు లేని పాఠశాలకు మేము రామంటూ గద్గదస్వరంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఇక్కడికి వచ్చిన ఉపాధ్యాయులు కూడా బాగా పాఠ్యాంశాలు బోధించి మీ అందరితో కలుపుగోలుగా ఉంటా రని సర్దిచెప్పి పంపించారు. తాడ్దానిపల్లి గ్రామ విద్యార్థులు తమ పట్ల చూపిన గౌరవం, ప్రేమాభిమానాలు ఎన్నటికీ మర్చిపోమని బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

రూ.3.50 లక్షల విలువైన గుట్కా పట్టివేత

జిన్నారం, జూలై 13: బొల్లారం మున్సిపాలిటీలో రూ. 3.50 లక్షల విలువ గల నిషేధిత గుట్కా ప్యాకెట్లను సీసీఎస్, స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం బొల్లారం మున్సిపాలిటీలో సీసీఎస్, స్థానిక పోలీసులు పలు కిరాణ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. మూడు షాపుల్లో దాచి ఉంచిన 3.50 లక్షల విలువ గల గుట్కా సంచులను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ దశరథ, సిబ్బంది మల్లేశం, విజయేందర్, సంజయ్, చంద్రశేఖర్, మోతిరామ్‌లు పాల్గొన్నారు.


జేఎన్‌టీయూలో డీఈవో వెంకటేశ్వర్లు, విద్యార్థులు

యాంటీ డ్రగ్స్ కార్యక్రమంలో జిల్లా విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, జూలై 13: హైదరాబాద్ కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో జరిగిన యాంటీ డ్రగ్స్ కార్యక్రమంలో జిల్లా విద్యార్థులు పాల్గొన్నారు. యాంటీ డ్రగ్స్, ట్రాఫిక్, సేఫ్ అన్ సేఫ్ టచ్, ఉమెన్ సెఫ్టీ హిడెన్ కెమెరా అంశాలపై ఇంటర్నేషన్ పాఠశాల విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాలకు సంబంధించిన విద్యార్థులతో నిర్వహించిన అవగాహన సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సదస్సులో జిల్లా నుంచి డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, జిల్లాలోని ఆరు పాఠశాలల గైడ్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎక్సైజ్ పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

కొల్లూరు వద్ద ఎండు గంజాయి పట్టివేత

పటాన్‌చెరు/రామచంద్రాపురం, జూలై 13: రామచంద్రాపురం మండల పరిధి కొల్లూరు అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) వద్ద ఎండు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అబ్కారీ శాఖ అధికారులు పట్టుకున్నారు. అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్ కథనం ప్రకారం... విశ్వసనీయమైన సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు కొల్లూరు టోల్‌గేట్ వద్ద తమ సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారన్నారు. ఈ క్రమంలో ఇద్దరు యాక్టీవా బైక్‌పై అనుమానస్పదంగా కనిపించడంతో ఏ. వంశీ, శివకృష్ణలను అడ్డుకుని ప్రశ్నించారు. వారి నుంచి 75 గ్రాముల ఎండు గంజాయిని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో శివకృష్ణ విచారణలో భాగంగా తమ ఇంటి వద్ద మరికొంత గంజాయి ఉన్నట్లు చెప్పడంతో ఖాజాగూడలోని నిందితుడి ఇంటికి వెళ్లి మరో 885 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని ఆంధ్రప్రదేశ్ నుంచి తీసుకువచ్చినట్టు శివకృష్ణ తెలిపారు. ఈ మేరకు పటాన్‌చెరు అబ్కారీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని, శనివారం నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో సీఐ గాంధీనాయక్, ఎస్‌ఐ అనీల్‌కుమార్, ఎండీ సలీం, రామారావు నాయక్, మల్లయ్య, వివేక్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

137.76 గ్రాముల గంజాయి స్వాధీనం..

ములుగు, జూలై 13: గంజాయి విక్రయిస్తున్న ముగ్గరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 137.76 గ్రాముల గంజాయి, బైక్‌లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ములుగు ఎస్‌ఐ సీహెచ్ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. కర్నాటక రాష్ట్రం గొండగవస్ గ్రామానికి చెందిన గవర్నగర్ మహేశ్ (28), జార్ఖండ్ రాష్ట్రం పరాసి గ్రామానికి చెందిన సద్దాం హుస్సేన్ (27), మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సుతారిగూడకు చెందిన మహమ్మద్ అబ్దుల్ సమీర్ (26)లు దుండిల్‌కు చెందిన పద్మ వద్ద 10 పాకెట్ల గంజాయి కొనుగోలు చేశారు. అందులో నుంచి 8 పాకెట్లు అమ్మేశారు. మిగిలి రెండు పాకెట్లలో ఉన్న 137.76 గ్రాముల గంజాయిని బండమైలారం గ్రామంలోని సన్‌సిటీ వెంచర్ వద్ద అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఎస్‌ఐ విజయ్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ సీసీ జానకిరాంరెడ్డిలు సిబ్బందితో దాడులు చేశారు. పోలీసులను చూసి ముగ్గురు పారిపోతుండగా, పట్టుకుని విచారించారు. వారి నుంచి గంజాయి, రెండు బైక్‌లు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ముగ్గురిని అరెస్టు చేసినట్లు విజయ్‌కుమార్ వివరించారు.

ఎవరి కోసం ఈ భవనాలు..!

రూ. కోట్లు పెట్టి కట్టి.. వదిలేశారు..

కోహీర్‌లో నిరూపయోగంగా విలేజ్ హట్స్- ఖేడ్‌లో ఖాళీగా రైతు బజార్


నారాయణఖేడ్‌లో నిరుపయోగంగా ఉన్న రైతు బజార్

అవి రైతుల కోసం రూ. కోట్లు ఖర్చు చేసి కట్టిన భవనాలు.. కోహీర్‌లో పదేళ్ల కింద విలేజ్ హట్స్ కట్టి ప్రారంభించకుండా వదిలేశారు. నారాయణఖేడ్‌లో రైతులకు, వ్యాపారులకు ఏ మాత్రం అనుకూలంగా లేని చోట నిర్మించారు. దీంతో అవి ఇప్పుడు శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికైనా వాటిని వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


ముళ్లపొదల మధ్య నిరుపయోగంగా విలేజ్ హట్స్

కోహీర్, జూలై 13: రైతులు తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకుని ప్రయోజనం పొందడానికి వీలుగా మండల కేంద్రమైన కోహీర్‌లో విలేజ్ హట్స్ పేరుతో నిర్మించిన విక్రయ కేంద్రాలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో అవి శిథిలావస్థకు చేరాయి. అంతేకాకుండా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. దీంతో రైతులు చేసేదేమీ లేక వారాంతపు సంతను రోడ్ల పైన ఏర్పాటు చేసుకుంటున్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామీణాభివృద్ధి సంస్థ 2010లో విలేజ్ హట్స్‌ను మంజూరు చేసింది. స్థలం ఇస్తే భవన నిర్మాణాలకు నిధులు ఇస్తామని చెప్పడంతో మార్కెట్ కమిటీ స్థలాన్ని కొనుగోలు చేసి ఇచ్చింది. 2010 మార్చి 4న అప్పటి మంత్రి జె. గీతారెడ్డి భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మూడేళ్ల తర్వాత 2013లో భవనాలు అందుబాటులోకి వచ్చాయి. విలేజ్ హట్స్ పేరుతో ఓ గది, రెండు షెడ్లు, వ్యవసాయోత్పత్తులను అరబెట్టేందుకు రెండు ప్లాట్‌ఫాంలను నిర్మించారు. అధికారికంగా ప్రారంభించకపోయినా పదేళ్ల క్రితం మండల సమైక్య సంఘాల మహిళలు ఇక్కడ తాత్కాలికంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే, నేటికీ వాటిని ప్రారంభించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకుని, కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం హట్స్ ఆవరణంలో పిచ్చి మొక్కలు ముళ్లపొదలతో నిండిపోయింది. గోడలకు బీటలు వాడాయి. విలేజ్ హట్స్ నిరూపయోగంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి విలేజ్ హట్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తే రైతులు వారాంతపు సంత అయినా ఇక్కడ నిర్వహించుకునే అవకాశం ఉంటుంది.



వినియోగంలోకి తీసుకురావాలి

పట్టణ ప్రధాన కూడలిలో నిర్మించిన రైతుబజార్‌లో వ్యాపార లావాదేవీలు కొనసాగనందున దానిని ఇతర అవసరాలకు వినియోగించాలి. నిరుపయోగంగా ఉండటంతో ప్రజాధనం వృథా అవడంతో పాటు భవనం శిథిలావస్థకు చేరుతుంది.

-నరేందర్, అధ్యక్షులు, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం

రూ. కోటితో కట్టారు..

నారాయణఖేడ్, జూలై 13: రైతులు, కూరగాయల వ్యాపారుల సౌలభ్యం కోసం గత ప్రభుత్వం రూ.కోటి వెచ్చించి నిర్మించిన రైతు బజార్ నిరుపయోగంగా మారింది. నారాయణఖేడ్‌లో అధిక శాతం ప్రజలు వ్యవసాయం చేస్తారు. కూరగాయలు పండించే రైతులు, వ్యాపారులకు సరైన స్థలం లేకపోవడంతో మార్కెట్ కమిటీ ద్వారా పాల శీతలీకరణ కేంద్రం ఆవరణలో రైతు బజార్‌ను నిర్మించారు. ఏడాదిలోనే పనులు పూర్తి చేసి, ప్రారంభోత్సవం కూడా చేశారు. ముందు భాగంలోని దుకాణ సముదాయాన్ని వ్యాపారులకు అద్దెకు ఇచ్చారు. రైతు బజార్ నిర్మించిన ప్రాంతం తమకు అనుకులంగా లేదంటూ కూరగాయల మార్కెట్ వ్యాపారులు కొద్ది రోజుల తర్వాత రైతు బజార్ ఖాళీ చేసి ప్రస్తుత మార్కెట్ నిర్వహిస్తున్న స్థలానికే వచ్చేశారు. దీంతో రైతు బజార్ నిరుపయోగంగా మారింది. నిర్వహణ లేకపోవడంతో రైతులు, వ్యాపారుల కోసం నిర్మించిన షెడ్లు, విశ్రాంతి గది శిథిలావస్థకు చేరుకుంటున్నారు. షెడ్ల మధ్యలో ఏర్పాటు చేసిన పార్కింగ్ టైల్స్ నుంచి పొదలు మొలకెత్తుతుండడానికి తోడుప్రధాన గేటు ముందు కూడ చెట్లు ఏపుగా పెరిగాయి. ప్రజాధనం వెచ్చించి నిర్మించిన రైతు బజార్ శిథిలావస్థకు చేరకముందే, ఇతర అవసరాలను వినియోగించాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అస్తవ్యస్త విద్యుత్ సరఫరాపై ఆగ్రహం

సబ్‌స్టేషన్ ముట్టడి.. జాతీయ రహదారిపై బైఠాయింపు


ఆందోళన చేస్తున్న తండావాసులతో మాట్లాడుతున్న ఏఎస్‌ఐ

అల్లాదుర్గం, జూలై 13 : నెల రోజులుగా ఆ తండాకు సరిగ్గా కరెంట్ సరఫరా కాకపోవడంతో ఆ తండావాసులు ట్రాన్స్‌కో అధికారుల తీరును నిరసిస్తూ శనివారం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. సబ్‌స్టేషన్ ముందున్న 161వ జాతీయ రహదారిపై బైఠాయించి, సుమారు గంట పాటు ఆందోళన చేపట్టారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గొల్లకుంట తండాకు నెల రోజులుగా విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా ఉందని తండావాసులు ఆరోపిస్తున్నారు. సంబంధిత ఏఈకి ఫోన్‌లో సమాచారం అందించేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదని, శుక్రవారం రాత్రి మొత్తం కరెంట్ లేకపోవడంతో జాగారం చేయాల్సి వచ్చిందని అంటున్నారు. తండాకు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్నప్పటికీ ఎక్కడో దూరంలో ఉన్న ఫీడర్ చానల్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తుండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తండాపై చిన్నచూపు చూస్తున్నారంటూ జాతీయ రహదారిపై బైఠాయించి విద్యుత్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తండావాసుల ఆందోళనతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఏఎస్‌ఐ దేవిదాస్ తన సిబ్బందితో వచ్చి ఆందోళన చేస్తున్న వారిని సముదాయించేందుకు ప్రయత్నించారు. సమస్య పరిష్కరించే వరకు ఆందోళన విరమించమని చెప్పడంతో ఏఎస్‌ఐ ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో వారు తండావాసులు ఆందోళనను విరమించారు.

మేకల చోరీకి యత్నం

గొల్లకుంట గిరిజన తండాలో శుక్రవారం నాటి రాత్రి విద్యుత్ సరఫరా నిలచిపోవడంతో దొంగలు ఇదే అదునుగా తండాలోని మేకలను చోరీ చేసేందుకు ప్రయత్నించారు. అవి అరవడంతో అప్రమత్తమైన తండావాసులు బయటకు రాగా, దొంగలు కత్తులు చూపిస్తూ ఓ కారులో పరారయ్యారని తండావాసులు తెలిపారు.

హైకోర్టు జీపీగా అనంతుల


అనంతుల రవీందర్

చేర్యాల, జూలై 13: చేర్యాల పట్టణానికి చెందిన న్యాయవాది అనంతుల రవీందర్ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జీపీగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో ఆర్‌టీ నెం. 399 జారీ చేసింది. వ్యవసాయ కుటుంబానికి చెంది సౌమ్యుడిగా పేరొందిన అనంతుల రవీందర్ ఇరవై ఐదేళ్లుగా న్యాయవాదవృత్తిలో ఉన్నారు. 1994 అసెంబ్లీ ఎన్నికలలో చేర్యాల బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. బీజేపీలో వివిద హోదాలలో కొనసాగుతూనే లీగల్‌సెల్‌కు సంబంధించి బీజేపీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా వ్యవహరించారు. కొన్నినెలల క్రితం కాంగ్రెస్‌లో చేరిన రవీం దర్‌కు న్యాయవాదివృత్తిలో ఉన్న అనుభవం దృష్ట్యా గవ ర్నమెంట్ ప్లీడర్‌గా అవకాశం లభించింది. గ్రామీణ ప్రాంతానికి చెందిన అనంతుల రవీందర్ హైకోర్టు జీపీగా నియమితులవడం పట్ల చేర్యాల న్యాయవాదులు భూమిగారి మనోహర్ తదితరులు హర్షం వెలిబుచ్చారు.

గజ్వేల్ కోర్టు ఏజీపీగా అనూష


అనూష

గజ్వేల్, జూలై 13: గజ్వేల్ ప్రిన్సిపల్, అదనపు జూనియర్ సివిల్ జడ్జీ కోర్టుల ఏజీపీ (అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్)గా పట్టణానికి చెందిన న్యాయవాది మూల అనూష నియమితులయ్యారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా మెజిస్ట్రేట్, కలెక్టర్ మిక్కిలినేని మనూచౌదరి ఉత్తర్వులను వెలువరించారు. హైదరాబాద్‌కు చెందిన మూల అనూష పెండకంటి లా కాలేజీ (చిక్కడపల్లి)లో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసి గడిచిన ఆరు సంవత్సరాలుగా ఆయా కోర్టులలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ప్రస్తుతం ఏజీపీగా నియమితులవడంతో న్యాయవాదులు, బంధువులు, కుటుంబసభ్యులు ఆమెకు అభినందనలు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తే కేసులా..?

ఉపాధ్యాయ సంఘాల నేతలు

మెదక్ అర్బన్, జూలై 13: విధుల్లో నిర్లక్ష్యాన్ని ప్రశ్నించిన తపస్ జిల్లా అధ్యక్షులు ఎల్లంపై కొడపాక ప్రధానోపాధ్యాయురాలు కేసు పెట్టడాన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. శనివారం స్థానిక గుల్షన్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు రాజ్‌గోపాల్‌గౌడ్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగయ్య, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మారావు, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, పీఈటీఏల అసోసియేషన్ జిల్లా కార్యదర్శులు శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, మాధవరెడ్డిలు మాట్లాడారు. ప్రధానోపాధ్యాయురాలు బాధ్యత కలిగిన హోదాలో, ఆదర్శంగా నివాల్సిన స్థానంలో ఉండి కాంప్లెక్స్‌లోని ఏ పాఠశాలలను సందర్శించకపోవడం, ఉపాధ్యాయులతో సరైన భాషలో మాట్లాడకపోవడం ఘోరమన్నారు. బదిలీపై వెళ్లిన ఎల్లం లాస్ట్ పే సర్టిఫికెట్ కోసం వెళ్లితే నువ్వెవరని హెచ్‌ఎం అవమానించారని ఆరోపించారు. ఉపాధ్యాయుల పట్ల వైఖరిని మార్చుకోవాలని హెచ్‌ఎంకు సూచిస్తే.. బాధ్యతగా వ్యవహరించాల్సిన హెచ్‌ఎం అక్రమ కేసులు నమోదు చేయించడం సరైంది కాదన్నారు. ఉపాధ్యాయుడు ఎల్లంపై నమోదు చేయించిన కేసును వెంటనే హెచ్‌ఎం ఉపసహంరించుకోవాలని డిమాండ్ చేశారు.



ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయాలి

● ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర

హుస్నాబాద్, జూలై 13: వివిధ ప్రభుత్వశాఖల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర డిమాండ్ చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డిల అమరుల భవనంలో శనివారం జరిగిన హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల ఏఐవైఎఫ్ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. తక్షణమే మెగా డీఎస్సీ నిర్వహించాలన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న యువజన వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద పవన్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగామ రాజ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్, మాడిశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



శరవేగంగా నిమ్జ్ రోడ్డు పనులు

ఝరాసంగం, జూలై 13: జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి(నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్) నిమ్జ్ 65 వ జాతీయ రహదారి నుంచి 9 కిల్లోమీటర్ల మేర తారు రోడ్డు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి చౌరస్తా నుంచి నిమ్జ్ వరకు 100 మీటర్ల వెడల్పుతో తొమ్మిది కిలో మీటర్ల మేర రోడ్డు పనులు చేపడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం రూ. 100 కోట్లు మంజూరు చేశారు. ఝరాసంగం మండలంలోని మాచునూర్, ఏల్గోయి, క్రిష్టాపూర్, బర్దీపూర్ గ్రామాల్లో 65 ఎకరాల భూమిని సేకరించారు. ఇందులో 229మంది రైతులకు గాను రూ. 7.5 కోట్లు పరిహారంగా చెల్లించారు.

ప్రాజెక్ట్ పూర్తయితే ఉపాధి అవకాశాలు.

నిమ్జ్ ప్రాజెక్ట్ పూర్తయితే ఈ ప్రాంతపు యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్రత్యేక్షంగా, పరోక్షంగా సుమారు 2.50 లక్షల మందికి మేలు చేకూరనుంది. ఇప్పటికే పలు పరిశ్రమలతో గత ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నాయి. టైటాన్‌కు 150 ఎకరాలు, లైట్ ఆటో పెట్టుబడికి 100 ఎకరాలు, వెమ్ టెక్నాలజీ పరిశ్రమ ఏర్పాటుకు 511 ఎకరాలను కేటాయించింది. హుండాయ్ పరిశ్రమ ఏర్పాటు కూడా జరగనున్నట్లు తెలిసింది. ఈ పరిశ్రమలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం. దీని దృష్టి సారించి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేశారు.

అవధాన విద్యకు మెదక్ సీమ పుట్టినిల్లు

కొండపాక, జూలై 13: అవధాన విద్యకు మెదక్ సీమ పుట్టినిల్లని ప్రముఖ అష్టావధాని డాక్టర్ బోచ్కర్ ఓంప్రకాశ్ పేర్కొన్నారు. కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శ్రీ విజయదుర్గా మాత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ప్రముఖ కవి బండకాడి అంజయ్య గౌడ్ అష్టావధానం చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఓం ప్రకాశ్ మాట్లాడుతూ అష్టకాల నరసింహ రామశర్మ, గుమ్మనగారి లక్ష్మి నరసింహశర్మ అష్టావధానం ప్రక్రియను సామాన్యుడి చెంతకు తీసుకువెళ్లారని తెలిపారు. గౌరీభట్ల రామకృష్ణ కవి అవధాన కళావికాసానికి పలువురిని ప్రోత్సహించారని, శతావధాని జీఎం రామశర్మ ప్రపంచ తెలుగు మహాసభలలో సిద్దిపేట కీర్తిప్రతిష్టలు చాటిచెప్పారన్నారు. పృచ్ఛకులుగా వర్కోలు లక్ష్మయ్య, ఉస్మాన్, గొల్లపల్లి రఘురామశర్మ, మిట్టపల్లి పరశురాములు, గండికోట కోటిలింగశర్మ, మచ్చ అనురాధ, ఉండ్రాళ్ల రాజేశం పాల్గొన్నారు. మంచినీళ్ల సరస్వతి, బాల సరస్వతి ప్రసంగించారు. అనంతరం అవధాని బండకాడి అంజయ్య గౌడ్, అతిథులను ట్రస్ట్ సభ్యులు హరినాథశర్మ, గట్టు విఠల్, నర్సింహారెడ్డి, మర్యాల రవీందర్, తిరుపతిరెడ్డి, బ్యాకు చంద్రశేఖర్ సత్కరించారు.

శతకాలు మానవ జీవన వికాసానికి దోహదం

కొండపాక, జూలై 13: శతకాలు మానవ జీవన వికాసానికి దోహదం చేస్తాయని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ ఆచార్య త్రివేణి అభిప్రాయపడ్డారు. కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శనివారం విజయదుర్గా మాత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంచినీళ్ళ రఘురామశర్మ రచించిన ధర్మపురి నృసింహ శతకాన్ని, బండకాడి అంజయ్య గౌడ్ రచించిన ధీనిధి శతకాల ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శతకాలను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ విజయాన్ని ప్రసాదించే అమ్మగా ప్రఖ్యాతి గాంచిన విజయ దుర్గాదేవి క్షేత్రంలో ఆవిష్కరించడం చారిత్రాత్మకమన్నారు. సభకు అధ్యక్షత వహించిన క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాధశర్మ మాట్లాడుతూ కీర్తిశేషులు మంచినీళ్ళ రఘురామశర్మ రచించిన ధర్మపురి నృసింహ శతకం భక్తి, జ్ఞాన వైరాగ్యాలకు ఆత్మ నివేదనకు ఆలవాలమని అన్నారు. బండకాడి అంజయ్య గౌడ్ రచించిన ధీనిధి శతకం సామాజిక నీతి శతకమన్నారు. శతకాలను గమ్మనగారి బాల సరస్వతి, మురళీధర శర్మ పరిచయం చేశారు. విశ్రాత ఉపన్యాసకులు వేలేటీ మృత్యుంజయశర్మ, అష్టకాల విద్యా చరణ్, సింగీతం నరసింహారావు, అవధాని గౌరీభట్ల రఘురామ్ శర్మ, మంచినీళ్ళ సరస్వతి, జనమంచి ఫణీంద్ర తదితరులు ప్రసంగించారు.


అవధానిని సత్కరిస్తున్న క్షేత్ర నిర్వాహకులు


మాట్లాడుతున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్

బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయాలి



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్

సంగారెడ్డి అర్బన్, జూలై 13 : బదిలీ అయిన టీచర్లను వెంటనే రిలీవ్ చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్ మాట్లాడుతూ లెఫ్ట్ ఓవర్ ఖాళీలలో తదుపరి సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బదిలీల్లో ఐచ్ఛికాలలో పొరపాట్లను సవరించి, న్యాయం చేయాలని కోరారు. జిల్లాలో ఎస్‌సీసీ అధికారుల బదిలీల విషయంలో జిల్లా విద్యాధికారి నిబంధనలను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రాంచందర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్ తదితర బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, రాజారెడ్డి, సోమశేఖర్, నాగేశ్వర్, జీవన్‌రావు, కమ్రోద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాసర్‌పటేల్, విజయభాస్కర్, పాండురంగారెడ్డి, నర్సింహులు, అశోక్‌కుమార్, బాబురావ్, ఇర్షద్, జగదీశ్వరయ్య, దీపక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డంప్‌యార్డును మరోచోటికి తరలించాలి

జిన్నారం, జూలై13: బొల్లారం మున్సిపాలిటీ గాంధీనగర్‌కు సమీపంలో ఉన్న డంప్‌యార్డును మరో చోటకు తరలించాలని మున్సిపల్ కౌన్సిలర్ చంద్రయ్య జిల్లా కలెక్టరేట్‌లో శనివారం వినతిపత్రం అందజేశారు. బొల్లారంలో నివాసాలకు సమీపంలో డంప్‌యార్డు నిర్వాహణతో దుర్వాసన వ్యాపించి స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారని, డంప్‌యార్డును మరో చోటకు తరళించాలని కలెక్టర్‌ను కోరుతూ వినతి పత్రం అందజేసినట్లు చంద్రయ్య తెలిపారు.

టౌన్‌హాల్ పనులకు మోక్షమెన్నడో?

- టీయూఎఫ్ఐడీసీ కింద రూ. కోటి మంజూరు
- నాలుగేళ్లు గడిచినా పిల్లర్ల దశ దాటని వైనం
- రూ.20 లక్షల బిల్లులు డ్రా చేసుకున్న కాంట్రాక్టర్



పిల్లర్లు (ఇనుప స్తంభాలు)దశకే పరిమితమైన టౌన్‌హాలు నిర్మాణం పనులు



నాటి మంత్రి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

జోగిపేట, జూలై 13: నిధులు మంజూరై నాలుగేళ్లు దాటినా పనులు మాత్రం పిల్లర్ల దశలోనే ఊగిసలాడుతున్న టౌన్‌హాల్ పనులు నత్త నడకను తలపిస్తున్నాయి. కాంట్రాక్టర్ టౌన్‌హాల్‌కు సంబంధించిన పిల్లర్లు(ఇనుప స్తంభాలను) మాత్రం వేసి.. ఆపై పట్టించుకోకపోవడంతో పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా మారాయి. ఇంత జరుగుతున్నా అధికారులు సైతం పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అందోలు పట్టణంలో టౌన్‌హాలు నిర్మాణం కలగానే గోచరిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు.

నాలుగేళ్ల క్రితం రూ. కోటి మంజూరు

అందోలు-జోగిపేట మున్సిపల్ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం అందోలు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కనే ఉన్న స్థలంలో టౌన్‌హాలు నిర్మాణానికి 2020లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. కోటి టీయూఎఫ్ఐడీసీ నిధులను మంజూరు చేసింది. పనులను నాటి ఆర్థికశాఖామంత్రి హరీశ్‌రావు, అప్పటి ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌తో కలిసి శంకుస్థాపన సైతం చేశారు. ఈ పనులను చేజిక్కించుకున్న శ్రీనివాస్ కన్‌స్ట్రక్షన్స్ వారు 2020 ఆగస్టులో టౌన్‌హాలు నిర్మాణం కోసం స్తంభాలను వేసి ఆరంభ శూరత్వం ప్రదర్శించారు. పనులకు సంబంధించిన రూ. 20లక్షల బిల్లులను డ్రా చేసుకున్న అనంతరం సదరు కంపెనీ పనులను మాత్రం కొనసాగించలేదు. పనులు పూర్తి చేయాలన్న ధ్యాస కాంట్రాక్టర్‌కు కొరవడడంతో పాటు, పూర్తి చేయించాల్సిన బాధ్యతను ఇటు మున్సిపల్ అధికారులు గానీ, అటు పాలకవర్గ సభ్యులు గానీ ఎవరూ తీసుకోలేదు. దీంతో టౌన్ హాలు నిర్మాణం పనులు కాస్తా అటకెక్కాయి. నాలుగేళ్లుగా ఈ పనులు ముందుకు సాగకున్నా అడిగే నాథుడే లేకపోయాడు. దీంతో టౌన్ హాలు ఆకాంక్ష కలేనా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

మరో కంట్రాక్టర్‌తో పూర్తి చేయిస్తాం



రేట్లు పెరిగినా దృష్ట్యా ఈ పనులు గిట్టుబాటు కావంటూ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ కంపెనీ చేతులెత్తేసింది. నేను బాధ్యతలు స్వీకరించిన వెంటనే కాంట్రాక్టు తీసుకున్న కంపెనీవారితో మాట్లాడి నోటీసులు ఇచ్చాం. వీలైనంత త్వరలో మరో కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించి టౌన్ హాలు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయిస్తాం.

- తిరుపతి, మున్సిపల్ కమిషనర్

సంతానం లేదని వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన అంబిక

నాగల్‌గిద్ద, జూలై 13: సంతానం లేదని మానసికంగా కృంగిపోయిన వివాహిత పుట్టింట్లో ఉరేసుకొని ఆత్మహత్య కు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని మావినెల్లిలో శనివారం చోటు చేసుకున్నది. ఎస్ఐ సాయిలు తెలిపిన వివరాల ప్రకారం.. మావినెల్లి గ్రామానికి చెందిన అంబిక(22)ను రెండేళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా బేలూరు గ్రామానికి చెందిన సాగర్‌తో వివాహం జరిపించారు. ఇటీవల ఆమె తన సోదరుడి వివాహం కోసమని పుట్టింటికి వచ్చింది. శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి మారుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని నారాయణఖేడ్ ఆస్పత్రికి తరలించామని ఎస్ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు.. వ్యక్తి మృతి

కొల్చారం, జూలై 13: మండలంలోని తుక్కాపూర్ శివారులోని ఆశ్రమం దగ్గర 25 రోజుల క్రితం ఆటో పల్టీ కొట్టిన ఘటనలో గాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తుక్కాపూర్ గ్రామస్థుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగలి క్రిష్ణ(40) అనే వ్యక్తి నెల రోజుల క్రితం ఆటోలో రంగంపేట నుంచి తుక్కాపూర్ వస్తుండగా ఆశ్రమం సమీపంలో పల్టీ కొట్టింది. ఈ సంఘటనలో మంగలి క్రిష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య అంజమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కొరివిపల్లిలో ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ

చిన్నశంకరంపేట, జూలై 13: మండలంలోని కొరివిపల్లి గ్రామంలో శనివారం అర్ధరాత్రి మూడు ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఉదయం వ్యవసాయ పొలాల వద్దకు ట్రాక్టర్లు తీసుకెళ్లేందుకు స్టార్ట్ చేయగా ఇంజన్ ఆన్ కాలేదు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్లు బ్యాటరీలు చోరీకి గురైనట్టు గమనించారు. బాధిత రైతులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



ఆటోలో పట్టుబడిన రేషన్ బియ్యం

శివ్వంపేట, జూలై 13: గ్రామాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తుండగా రెవెన్యూ అధికారులు పట్టుకున్న సంఘటన ఉసిరికపల్లి చౌరస్తాలో శనివారం చోటుచేసుకున్నది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సునీల్ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం ఉసిరికపల్లి చౌరస్తాలో ఆర్ఐ సునీల్, కిషన్‌లు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా ఆటోలో సుమారు 10 క్వింటాళ్లకు పైగా రేషన్ బియ్యం ఉండగా 6 క్వింటాళ్ల బియ్యం మాత్రమే ఉన్నాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారని స్థానికులు ఆరోపించారు. ఆర్ఐ సునీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు

యావాపూర్‌లో కుంట కబ్జా



యావాపూర్‌లో కుంట కట్టపై పాతిన కడీలు

తూప్రాన్, జూలై 13: తూప్రాన్ మండలంలో కుంటలు, చెరువుల కబ్జాలు, అక్రమణలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అయినా సంబంధిత ఇరిగేషన్, రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటంలేదు. తాజాగా తూప్రాన్ మండలం యావాపూర్ శివారులోని గుండకుంట కబ్జాకు పాల్పడ్డారు. కుంట కట్టను అక్రమించి రాతి కడీలు వేశారు. కుంట కట్ట తూం సైతం మూసి వేశారు. కుంట కట్ట కబ్జా, తూం మూసివేతపై చర్యలు తీసుకోవాలని నాయకులు కుమ్మరి నర్సింహులు తదితరులు డిమాండ్ చేశారు.

సంగారెడ్డిలో ఉచిత హెల్త్ క్యాంపు




జ్యోతి ప్రజ్వలన చేసి హెల్త్‌క్యాంపును ప్రారంభిస్తున్న గోకుల్ ఆస్పత్రి ఎండీ శ్రీహరి

సంగారెడ్డి అర్బన్, జూలై 13 : సంగారెడ్డిలోని ఇష్టా జూనియర్ కళాశాలలో శనివారం ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. గోకుల్ వెంకటేశ్వర ఆస్పత్రి, గౌతమి డెంటల్ ఆస్పతి సంయుక్తంగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. గోకుల్ ఆస్పత్రి ఎండీ డా.శ్రీహరి జ్యోతి ప్రజ్వలన చేసి క్యాంపును ప్రారంభించగా, డా. ఎస్ రాజచైతన్య విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ పిల్లల శారీరక మానసిక సమగ్రాభివృద్ధే తమ లక్ష్యమని, విద్యార్థుల సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు.

ఘనంగా ఏకాదశ మాస చండీయాగం

కల్హేర్, జూలై 13: సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బల్కంచెల్కా తండాలోని ప్రఖ్యాత విశ్వపాలిని జ్వాలాముఖి భవానీమాతా, సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయాల ఆవరణలో శనివారం ఏకాదశ మాస చండీయాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రముఖ వాస్తు జ్యోతిష్య పండితులు వక్కంతం చంద్రమౌళీశర్మ, ఆలయ పూజారి మనోజ్ శర్మల నిర్వహణలో ఈ యాగం నిర్వహించారు. ప్రతి మాసంలో రెండవ శనివారం ఈ యాగం నిర్వహిస్తున్నట్లు ఆలయాల ధర్మకర్త, మేడ్చల్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్‌సింగ్, బల్కంచెల్కా తండా మాజీ సర్పంచ్ మూడ్ లలిత తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాములు, రూప్‌సింగ్, శంకర్, మన్‌మోహన్, సవాయిసింగ్‌లతో పాటు సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ఎంపీ,ఎమ్మెల్యేలను సన్మానించిన సీడీసీ చైర్మన్



సురేష్ షెట్కార్‌ను సన్మానిస్తున్న సీడీసీ చైర్మన్ శాదుల్ తదితరులు

నారాయణఖేడ్, జూలై 13: కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మాగిలోని జీఎస్ఆర్ చక్కెర కర్మాగారం సీడీసీ చైర్మన్‌గా నియామకం అయిన కంగ్టి మండలం జంబ్గి.బి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు శాదుల్ శనివారం నారాయణఖేడ్‌లో ఎంపీ సురేష్ షెట్కార్‌ను, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డిలను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాదుల్ మాట్లాడుతూ మారుమూల గ్రామానికి చెందిన తనకు సీడీసీ చైర్మన్‌గా అవకాశం ఇచ్చినందుకు మంత్రిశ్రీధర్‌బాబు, ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, లక్ష్మీకాంతరావు, మదన్‌మోహన్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఫరూక్, ఆసీఫ్, ఆరీఫ్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

ప్రభుత్వప్లీడర్‌ను సన్మానించిన ఎంపీ

నారాయణఖేడ్,జూలై 13: జిల్లా ప్రభుత్వ ప్లీడర్‌గా బాధ్యతలు స్వీకరించిన మండలంలోని హంగర్గ.కె గ్రామానికి చెందిన వైద్యనాథ్ వీరప్పపాటిల్‌ను శనివారం నారాయణఖేడ్‌లో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ సన్మానించి అభినందించారు. ప్రభుత్వ ప్లీడర్‌గా నియామకమైన వైద్యనాథ్‌పాటిల్ మర్యాదపూర్వకంగా ఎంపీని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆయనను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

కొండాపూర్ హనుమాన్ ఆలయంలో భక్తుల సందడి

నారాయణఖేడ్, జూలై 13: మండలంలోని కొండాపూర్ హనుమాన్ ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వయంభువుగా వెలసిన కొండాపూర్‌హనుమాన్ ఆలయంలో ప్రతీ శనివారం స్వామివారిని దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారు. రెండో శనివారం కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వర్షాల కోసం జలాభిషేకాలు

నారాయణఖేడ్:వర్షాల కోసం శనివారం సంజీవన్‌రావుపేట, పోతన్‌పల్లి, గంగాపూర్, కొండాపూర్,కద్పల్ గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో జలాభిషేకాలు చేశారు.

ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు





సత్వార్, అల్గోల్ గ్రామాల్లో బదిలీ అయినవారిని సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది

జహీరాబాద్, జూలై 13: వారం రోజులుగా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ మొదలైన నేపథ్యంలో జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల పరిధిలోని పలు ప్రభుత్వపాఠశాలల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం అల్గోల్, సత్వార్ గ్రామాల్లో బదిలీలపై వెళ్తున్న ఉపాధ్యాయులకు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, మల్లయ్యస్వామి, జైపాల్, సుమలత, జయశ్రీ, లక్ష్మి, సంజీవకుమార్, విజయలక్ష్మి, సునిత, విశ్వనాథ్, మోహన్‌రెడ్డి, సంగమేశ్వర్, జైపాల్, బాగయ్య, వరకుమారి, శ్రీలత, సాయికుమార్, రాజేశ్వర్, నాగేష్, మేరజ్‌ఫాతిమ, అంజలి, విద్యార్థులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం చేరుకున్న జైన దిగంబరస్వాములు



కొల్చారంలో దిగంబరస్వాములకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

కొల్చారం, జూలై 13: మండల కేంద్రంలోని ప్రముఖ జైన దేవాలయంలో ఆదివారం ప్రారంభం కానున్న చాతుర్మాస దీక్షలకు జైన దిగంబరస్వాములు శనివారం కొల్చారం చేరుకున్నారు. జైన అతిక్షయ్ ట్రస్టు ఆధ్వర్యంలో జరుగనున్న ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఆచార్య అంతర్మణ 108 ప్రసన్నసాగర్ ముని మహారాజ్‌తో పాటు 17 మంది దిగంబరస్వాములు మహారాష్ట్రలోని కోలాపూర్ నుంచి బెంగుళూరు మీదుగా హైదరాబాద్ నుంచి కాలినడకన కొల్చారం మండల కేంద్రానికి చేరుకున్నారు. కొల్చారం జైన దేవాలయం వద్ద నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు చాతుర్మాస ఉత్సవాలు జరుగుతాయని ట్రస్టు అధ్యక్షుడు సుమేర్ చంద్ జైన్ తెలిపారు. నవంబర్ మూడో తేదీ వరకు కొల్చారంలోనే స్వామివారు ఉండి ప్రజలు, భక్తులను ఆశీర్వదిస్తారని తెలిపారు. అనంతరం ఇక్కడి నుంచి కేదారినాథ్‌కు కాలినడకన వెళ్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి మహేందర్‌కుమార్ జైన్, ట్రస్ట్ మెంబర్ రామకృష్ణప్రసాద్, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కరెంటు రాజాగౌడ్, సీడీసీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నింగోల్ల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మాసాయిపేటలో జోరుగా మట్టి అక్రమ రవాణా



వెంచర్ల వద్దకు తరలించిన మట్టి కుప్పలు

మాసాయిపేట, జూలై 13: మండలంలో నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తూ వ్యాపారులు బరితెగిస్తున్నారు. ఏకంగా అనుమతులు పొందామని పాత అనుమతి పత్రాలతో గ్రామస్థులకు నమ్మబలుకుతూ, కొందరు దళారులు, స్థానిక నాయకులతో కలిసి ఏకంగా పట్టపగలే వందల కొద్ది ట్రిప్పుల మట్టిని జాతీయ రహదారిపై నుంచి టిప్పర్ల ద్వారా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. అడ్డు వచ్చే వారిని బెదిరిస్తూ, లేదంటే ప్రలోభాలకు గురి చేస్తూ పరిశ్రమలకు, వెంచర్లకు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మాసాయిపేట మండలంలోని రామంతపూర్, లింగారెడ్డి పేట, బొమ్మారం, నాగసానిపల్లి, కొప్పులపల్లి, మాసాయిపేట, చెట్ల తిమ్మాయిపల్లి గ్రామాల నుంచి ప్రతిరోజూ రాత్రి సమయంలో భారీ ఎత్తున టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా కొందరు వ్యాపారులు భారీ ఎత్తున మట్టిని తరలిస్తున్నారు. రామంతపూర్, చెట్లతిమ్మాయిపల్లి, కొప్పులపల్లి, అచ్చంపేట గ్రామాల నుంచి కొందరు బడా వ్యాపారులు బహిరంగంగా పట్టపగలే భారీ యంత్రాల ద్వారా మట్టిని తవ్వేస్తూ, పలువురు అధికారుల అండతో మట్టి వ్యాపారం కొనసాగిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన ఆయా శాఖల అధికారులు సరైన సిబ్బంది లేక మట్టి రవాణాను పూర్తిగా కట్టడి చేయలేకపోతున్నామని చెప్పడం గమనార్హం.

మట్టి తరలిస్తే కఠిన చర్యలు

మండలంలో అక్రమంగా మట్టిని తరలించిన మట్టి వ్యాపారాన్ని ప్రోత్సహించిన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తాం. అక్రమంగా ఎవరైనా మట్టి తరలింపునకు పాల్పడితే, ప్రజలు మాకు సమాచారం అందించాలి. మట్టిని తరలించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

- జ్ఞానజ్యోతి, తహసీల్దార్, మాసాయిపేట

అధ్వానంగా లింక్‌రోడ్లు





గుడిపల్లి-ధనసిరి గ్రామాల మధ్య లింక్ రోడ్డు, బూచనెల్లి-తూంకుంట మధ్య పాడైన లింక్ రోడ్డు

జహీరాబాద్, జూలై 13: గ్రామాలను కలిపే లింక్ రోడ్లను అభివృద్ధి చేస్తే ప్రజలకు వ్యయప్రయాసాలు తగ్గి సౌకర్యంగా ఉంటుందని జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల ప్రజలు కోరుతున్నారు. లింక్‌రోడ్లు సక్రమంగా లేకపోవడంతో సమీపంలో ఉన్న గ్రామాలకు వెళ్లాలంటే ప్రధాన రోడ్లపై నుంచి చుట్టూ తిరిగి వెళ్లాల్సివస్తున్నదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే..

సరిగా లేక దూరభారం

జహీరాబాద్ మండలంలోని బూచనెల్లి-తూంకుంట గ్రామాలకు మధ్యలో గల లింక్ రోడ్డు ద్వారా వెళ్తే 4కిలోమీటర్లు ఉండగా, చుట్టూ తిరిగి వెళ్లాలంటే 8 కిలోమీటర్లు, బుడ్డిపాడ్ నుంచి బూచనెల్లికి మధ్య దూరం 4కిలోమీటర్లు కాగా, చుట్టు తిరిగి వెళ్లాలంటే 9కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సివస్తోంది. అలాగే ఆనెగుంట నుంచి మల్చెల్మ గ్రామాల మధ్యలో గల లింక్‌రోడ్డు ద్వారా వెళ్తే.. 5కిలోమీటర్ల దూరం కాగా, ప్రధాన రోడ్డు పై నుంచి చుట్టూ తిరిగి వెళ్లాలంటే 12కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. అలాగే మొగుడంపల్లి మండలంలోని గుడిపల్లి నుంచి ధనసిరి రోడ్డుకు వెళ్లాలంటే 3కిలోమీటర్ల దూరం ఉండగా, 10కిలోమీటర్ల దూరం ప్రయాణం తప్పడం లేదు. ఇలా మండలంలోని ప్రతీ గ్రామం నుంచి మరో గ్రామానికి లింక్‌రోడ్లు(పానాదులు) ఉన్నాయి. అయితే లింక్‌రోడ్లను అభివృద్ధి చేయకపోవడంతో ప్రజలు సమీప గ్రామాలకు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది. లింక్‌రోడ్లను అభివృద్ధి చేయాలని పలుమార్లు అధికారులకు, నాయకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయాగ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి లింక్‌రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భారతీయ నంది నేషనల్ అవార్డు అందజేత



హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటున్న రవిప్రసాద్

కౌడిపల్లి, జూలై 13: కొంతకాలంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ మంచి గుర్తింపు పొందిన మండలంలోని వెల్మకన్నె గ్రామానికి చెందిన పురోహితుడు గంటంబొట్ల రవిప్రసాద్ సేవా కార్యక్రమాలను గుర్తించిన సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీవో, స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు శనివారం అతడికి భారతీయ నంది నేషనల్ అవార్డును అందజేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌హాల్‌లో ఈ అవార్డును అందజేశారు. స్ఫూర్తి సర్వీసెస్ సొసైటి ఇండియా ఎన్జీవో ఫౌండర్ చైర్మన్ డాక్టర్ ఆకుల రవి మాట్లాడుతూ వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేషంగా కృషి చేసిన రవి మరిన్ని సేవలు అందిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

కనీస వేతన బోర్డు చైర్మన్‌కు సన్మానం



జనక్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు

పటాన్‌చెరు, జూలై 13: కనీస వేతన అడ్వైజరీ బోర్డు చైర్మన్‌గా నియామకమైన జనక్‌ప్రసాద్‌ను పటాన్‌చెరు కార్మిక నాయకులు, ఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి నేతృత్వంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు కార్మిక నాయకులు సన్మానించి జిల్లాలోని కార్మిక సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు. కనీస వేతనాల అమలును పట్టించుకోకుండా కార్మికులను వేధిస్తున్న యాజమాన్యాలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సన్మానించిన వారిలో ఐఎన్‌టీయూసీ నాయకులు చంద్రశేఖర్, నాగన్నగౌడ్, రాజిరెడ్డి, సామభాస్కర్, జైపాల్‌రెడ్డి తదితరులున్నారు.

జిన్నారం ఎస్ఐగా నాగలక్ష్మి



జిన్నారం, జూలై 13: జిన్నారం ఎస్ఐగా నాగలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. జిన్నారం ఎస్ఐగా పని చేసిన విజయ్‌రావు బదిలీపై వెళ్లగా.. ఆయన స్థానంలో సంగారెడ్డి నుంచి బదిలీపై వచ్చిన నాగలక్ష్మి శనివారం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు.

జహీరాబాద్ పట్టణ ఎస్ఐగా కాశీనాథ్



జహీరాబాద్, జూలై 13: జహీరాబాద్ పట్టణ ఎస్ఐగా కాశీనాథ్ శనివారం పదవీబాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్ఐగా పని చేసిన లక్ష్మారెడ్డి పటాన్‌చెరుకు బదిలీపై వెళ్లారు. తాండూర్‌లో పనిచేసిన ఎస్ఐ కాశీనాథ్ బదిలీపై జహీరాబాద్‌కు రావడంతో లక్ష్మారెడ్డి ఆతడికి బాధ్యతలను అప్పగించారు.

ఓపెన్ జిమ్‌కు రూ.లక్ష విరాళం



విరాళదాతను సన్మానిస్తున్న గ్రామస్థులు

నిజాంపేట, జూలై 13: క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రోగనిరోధక వ్యవస్థను బలోపేతమై ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని బీఆర్ఎస్ పార్టీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్‌కు తిరుపతిరెడ్డి తనవంతుగా రూ.లక్ష విరాళాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన యువకులు ట్రస్టులు ఏర్పాటు చేసి ఓపెన్ జిమ్‌కు విరాళాలు సేకరించడం అభినందనీయమన్నారు. అనంతరం విరాళ దాత కంఠారెడ్డి తిరుపతిరెడ్డికి గ్రామస్థులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మన్ లు బాపురెడ్డి, బాజే చంద్రం, బీఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, మహమ్మద్ గౌస్, చింతల స్వామి మావురం రాజు, ఆరోగ్యమే మహాభాగ్యం ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వితే చర్యలు

నాగల్‌గిద్ద, జూలై 13: ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని నాగల్‌గిద్ద ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కుమార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఔదత్‌పూర్‌లో ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు చేపడుతున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో తమ సిబ్బంది అక్కడికి వెళ్లి పనులను నిలిపి వేశారన్నారు. ప్రభుత్వ భూమిలో అనుమతి లేనిదే పనులు చేపడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.